క్లుప్తంగా

నేడు వలంటీర్లకు పురస్కారాలు

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మలకల సూర్యారావు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు



గొల్లప్రోలులోని విత్తన దుకాణంలో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

పిఠాపురం: విత్తనాలు అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి హెచ్చరించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని పలు విత్తన దుకాణాల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. కొత్తగా వచ్చిన విత్తనాల శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు అమ్మే ముందు మొలక శాతం గుర్తించాలన్నారు. 80 శాతం మొలక లేకపోతే వాటిని విక్రయించరాదన్నారు. విత్తనాలు అమ్మినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, అలా ఇవ్వని దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

288 మంది కంటి పరీక్షలు

సామర్లకోట: స్థానిక 20వ వార్డులోని నీలమ్మ చెరువు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ఆ వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ ప్రారంభించారు. విజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేయగా 228 మంది కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చిట్టుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలి సర్వే నంబర్ 133–1లోని 371 ఎకరాల్లో ప్రభుత్వం ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పంచాయతీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు సాగు చేసుకుంటున్న భూముల్లో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిల్లా చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు బచ్చు ఫౌండేషన్ విద్యార్థి ఎంపిక



హర్ష వర్ధన్

సామర్లకోట: ఎన్ఎంఎంఎస్ పథకానికి స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి గోర్త హర్ష వర్ధన్ ఎంపికై నట్టు ఆ పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి అయ్యే వరకూ నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని హెచ్ఎం సాయిరామకృష్ణ తెలిపారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి



వాకతిప్ప చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వసంతమాధవి

కొత్తపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన మిషన్ అమృత్ సరోవర్‌లో భాగంగా గ్రామాల్లోని చెరువులను ఆధునీకరిస్తున్నట్టు ఉపాధి ఏపీడీ వసంతమాధవి తెలిపారు. మండలంలోని వాకతిప్ప చెరువు ఆధునీకరణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాది కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని మిషన్ అమృత్ సరోవర్‌లో చెరువులను ఆధునీకరించడంతో పాటు గట్లపై మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. మిషన్ అమృత్ సరోవర్‌కు మండలంలో 5 చెరువులు ఎంపికై నట్టు తెలిపారు. ఆమె వెంట ఉపాధి ఏపీఓ రాజబాబు, సర్పంచ్ పాలాని దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు ఉన్నారు.

తీరానికి రక్షణ కరవు

- సముద్ర గర్భంలో కలిసిపోతున్న జియోట్యూబ్
- ప్రమాదకరంగా మారిన ఉప్పాడ తీరం
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు



ఉప్పాడ వద్ద సముద్ర గర్భంలో కలుస్తున్న సీసీ రోడ్డు

కొత్తపల్లి: ఉప్పాడ తీరప్రాంతాన్ని రక్షించేందుకు నిర్మించిన జియో ట్యూబ్ (రక్షణ గోడ) సముద్ర గర్భంలో కలిసిపోవడంతో తీరప్రాంతానికి రక్షణ కరువైంది. దీంతో ఉప్పాడ తీరప్రాంతంలో మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. భారీ తుపానులు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఈ రక్షణ గోడ ఎదుర్కొంది. సుమారు రూ.12 కోట్లు వెచ్చించి జియో ట్యూబ్ టెక్నాలజీతో నిర్మించిన రక్షణ గోడ ప్రస్తుతం సాగర గర్భంలో కలసి పోయింది. రోజురోజుకూ గోడ నిర్మాణానికి ఉపయోగించిన నైలాన్ తాడు తెగిపోతూ రాళ్ల చెల్లాచెదురై తీరప్రాంతం కోతకు గురవుతోంది.

ఏడాదికి రెండు నుంచి మూడు తుపానులు

ఇప్పటికే ఉప్పాడలో మూడొంతుల తీరం సముద్రంలో కలిసిపోయింది. తుపానులు వచ్చినప్పుడల్లా తీరం కోతకు గురికావడం, అధికారులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగా మారింది. తీరప్రాతం రక్షణకు శాశ్వత పాతిపదికన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. గత 55 ఏళ్లలో సంవత్సరానికి 2 నుంచి 3 తుపానులు చొప్పున ఇప్పటి వరకూ 110 పైగా తుపానులు సంభవించాయని మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో ఈ తీరప్రాంతంలో 3 ట్రావెల్ బంగ్లాలు, 2 పొగాకు బీడు కేంద్రాలు, సుమారు 200 ఎకరాలకు పైగా సరుగుడు తోటలు, 500 పైగా గృహాలు సముద్ర గర్భంలో కలసిపోయాయి.

రూ.12 కోట్లతో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర రక్షణశాఖ మాజీ సహాయ మంత్రి ఎంఎం.పళ్లంరాజు చొరవతో సుమారు రూ.12 కోట్లతో ఉప్పాడ తీరంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మించారు. అనేక సాధారణ తుపానులతో పాటు తీవ్రమైన హుద్‌హుద్ తుపాను నుంచి ఉప్పాడ తీర ప్రాంతం కోతకు గురికాకుండా జియోట్యూబ్ రక్షణగా నిలిచింది.



వైఎస్సార్ పాలనలో ఉప్పాడ తీరంలో నిర్మించిన రక్షణగోడ



రక్షణ గోడ ధ్వంసమై కోతకు గురైన మత్స్యకార గృహాలు



సముద్రంలో కలిసిన సీతారాముల ఆలయం

రక్షణ చర్యలు చేపట్టాలి



తీర ప్రాంత గ్రామాలు కోతకు గురికాకుండా ప్రభుత్వం శాశ్వతప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలి. తుపానులు, సముద్రంలో సంభవించే ఆటుపోట్ల కారణంగా కెరటాలు ఉవ్వెత్తిన ఎగసిపడడంతో తీర ప్రాంతం, మా గృహాలు కళ్లముందే సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి.

పిక్కి అప్పలరాజు, మత్స్యకారుడు, ఉప్పాడ

గత పాలకుల నిర్లక్ష్యమే కారణం



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన రక్షణ గోడ మాకు ఇప్పటివరకూ రక్షణగా నిలిచింది. ఆయన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ గోడ రక్షణను పట్టించుకోలేదు. దీంతో రక్షణ గోడ సముద్ర గర్భంలో కలిసిపోయింది. ప్రస్తుతం మా గృహాలు కోతకు గురవుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తీరంలో మత్స్యకారులకు కోపపాపపేటలో ఇళ్ల స్థలాలు కేటాయించారు.

జి.అమ్మాజీ, మత్స్యకార మహిళ,ఉప్పాడ

రూ.30 కోట్లతో ప్రతిపాదనలు



ఉప్పాడ, కోపపాపపేట తీరప్రాంతంలో ఉన్న గృహాలు కోతకు గురికాకుండా రక్షణ కల్పించేందుకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రభుత్వానికి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తీర ప్రాంతం రక్షణ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. తీరప్రాంతంలోని ప్రతి మత్స్యకార కుటుంబానికి ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేసింది.

ఉమ్మిడి జాన్, మాజీ సర్పంచ్, ఉప్పాడ

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం అధిక సంఖ్య భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారు జామున స్వామివారికి మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరుపున అన్న దానం చేశారు. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజలు అనంతరం మధ్యాహ్నం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలోను అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డివిజన్ స్థాయి స్పందనకు 12 అర్జీలు

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 12 అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై 12 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. అధికారులందరూ వారి పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్నకార్పొరేషన్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. శుక్రవారం కొండపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహసారధుల మండల కన్వీనర్ గోపు మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కేశారపు అయ్యన్న, పోకనాటి దుర్గారావు, ధనయ్యలతో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు గ్రామంలోని గడపగడపను దొరబాబు సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడపగడపకూ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంతో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, ఏఎంసీ చైర్మన్ పోకనాటి శేషారావు, కేదారి శ్రీనివాస్, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షం విషం చిమ్ముతోంది

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: వాళ్లు అభివృద్ధి చేయలేదు, మేము చేసి చూపిస్తుంటే ఓర్వలేక బురదజల్లుతున్నారు అంటూ ప్రతిపక్షంపై ఎమ్మెల్యే పెండెం దొరబాబు విరుచుకుపడ్డారు. సోమవారం ఆయన పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాన రాష్ట్రంలో సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రాష్ట్రంలో 39 లక్షలు మాత్రమే పింఛన్లు ఇవ్వగా తమ ప్రభుతంలో 62 లక్షల పింఛన్లు ఇస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు లేని పోని ఆరోపణలు చేస్తున్నాయని, కొన్ని పత్రికలు లేనిపోని రాతలతో అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎవరైనా వచ్చి ప్రతి గ్రామంలోనూ ప్రతీ ఇంటికి వెళ్లి పథకాలపై విచారణ చేయవచ్చన్నారు. అందరికీ ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాలను వారికి వివరించడంతో పాటు మళ్లీ రెండో దఫా తిరిగి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తామని ధైర్యంగా చెప్పగలుగుతున్నామంటే ప్రభుత్వం చేసిన అభివృద్ధే కారణమన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు మళ్లీ మోసపూరిత హామీలను ఇస్తున్నారన్నారు. ప్రజలు ఇక చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలన

మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్



రోడ్డు నిర్మాణానినికి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తోందని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలో నాలుగో వార్డు నాయీ బ్రాహ్మణ కాలనీలో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తుందని, పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. ప్రజలకు అవసరమైన డ్రైన్లు, రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేశామన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ అన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ విడదాసరి రాజా, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులున్నారు.

ఎత్తుకుపోయి.. ప్రేమతో హత్తుకుని..



కోడి పిల్లను తన ఒడిలో దాచుకున్న కోతి




కోడి పిల్లకు అరటి పండు తినిపిస్తున్న కోతి

పిఠాపురం: సాధారణంగా కోతులు తమ పిల్లలను కడుపున హత్తుకుని మోస్తాయి. కాగా కొత్తపల్లి ఓ కోతి కోడి పిల్లను తన కడుపున హత్తుకుని తిరగడం చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒక ఇంట్లో కనిపించిన కోడి పిల్లను ఎత్తుకుపోయిన కోతి దానిని ఎంతకూ వదలకుండా కడుపున హత్తుకుని తిరుగుతోంది. స్థానికులు కోడి పిల్లను వదిలించడానికి ఎంత ప్రయత్నం చేసినా గత మూడు రోజులుగా కోతి కోడిపిల్లను వదలక పోవడం విశేషం. తనకు స్థానికులు పెట్టిన అరటి పండ్లను కోడిపిల్లకు తినిపించడం చూసి చూపరులు ఆశ్చర్యపోతున్నారు.

ముందుగానే నారుమళ్లు వేసుకోవాలి

పిఠాపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమళ్లు ముందుగానే వేసుకోవాలని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి రైతులకు సూచించారు. ఇప్పటి నుంచే నారుమళ్లు వేసుకోవడం వల్ల పంట అక్టోబర్ నెలలో చేతికందే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఆలస్యంగా నారుమళ్లు వేస్తే అధిక వర్షాలు, తుపాన్లు వచ్చే సమయానికి పంట చివరి దశకు చేరుకుని నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు త్వరగా నారుమళ్లు వేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. బిల్లులు లేకుండా ఏ దుకాణంలోనూ విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకుని విత్తనాలు కొనుగోలు చేయాలని, రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.

పాదాంబిక అమ్మవారికి మహా నివేదన



గొల్లప్రోలులో పాదాంబిక అమ్మవారికి మహా నివేదన

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో వేంచేసిన పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి మహా నివేదన (తిరుప్పావడ సేవ)కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పులిహోర రాశిగా పోసి జిలేబీలు, అరిసెలు, పొంగడాలు, వివిధ రకాల పండ్లు అలంకరించి రాశి ముందు క్షీరాన్నం ఉంచి అమ్మవారికి నివేదించారు. అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా పంచారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మల్లెపూలు, గులాబీలు, సంపెంగి పూలతో కవాటబంధనం చేశారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి అమ్మవారి గర్భాలయాన్ని తెరచారు. సుగంధ పరిమళాల నడుమ అమ్మవారు భక్తులకు దర్శమివ్వగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి అలంకరించిన పూలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పెద్దాపురం కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి కమలాదేవి



సామర్లకోట హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద మొక్కలు నాటిన దొరబాబు తదితరులు



సామర్లకోట స్టేషన్ సెంటర్ జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేసిన రాక్ సిరామిక్స్ అధికారులు

- అదనపు జిల్లా జడ్జి కమలాదేవి
- గ్రామాల్లో ర్యాలీలు

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తూర్పుగోదావరి జిల్లా అదనపు జిల్లా జడ్జి కమలాదేవి అన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక కోర్టు అవరణలో ఏజేఏఫ్‌సీఎంజే, జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ మొక్కల ద్వారా వచ్చే స్వచ్ఛమైన గాలి కరువవుతుందన్నారు. ప్రపంచంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వేదుల మణి, చుక్కాకుల రవిబాబు, ఏపీపీ మృత్యుంజయరావు, కందుల వెంకటాచలం, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పీసీసీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పీసీసీ కన్వీనర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గురుదేవ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఐవీఆర్ త్రినాథ్ మాట్లాడారు. అనంతరం పర్యవరణానికి సంబంధించి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుంగల పూజిత, శ్యామ్‌కుమార్, ఉమామహేశ్వరి, నమ్రత, ఆర్.రవి, కె.రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద మొక్కలు నాటిన దొరబాబు

సామర్లకోట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడ హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నట్టు దొరబాబు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సామర్లకోట: ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని రాక్ సిరామిక్స్ ప్లాంట్ హెడ్ శాశ్వతకుమార్ మహాపాత్ర అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేరకు ప్రతీ కార్మికుడు, ఉద్యోగి తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలన్నారు. ఏడీబీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాక్‌సిరామిక్స్ అధికారులు టి.నీరజ్‌కుమార్, పి.బాలాజీ, వీజీఎస్ కుమార్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆవరణలో..

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాటు పారంపై ర్యాలీ నిర్వహించి, ప్రయాణికులకు క్లాత్ కవర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈఎన్ శివప్రసాద్, హెల్త్ ఇన్‌స్పెక్టరు కిశోర్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిపై ఫిర్యాదు

పిఠాపురం: పురుడు పోసే సమయంలో తన బిడ్డను తనకు తెలియకుండా దొంగచాటుగా తీసుకుని వేరొకరికి అమ్మేసుకుందంటూ పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు మోమినాపై పట్టణానికి చెందిన దాసరి లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫిర్యాదును సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ స్పందనలో అందజేసినట్లు బాధితురాలు తెలిపింది. గత రెండేళ్లుగా తన బిడ్డ కోసం ఎన్ని సార్లు అడిగినా సమాధానం చెప్పకపోగా, తనను బెదిరిస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది.

కనకదుర్గమ్మకు చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల ' సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, కూచిమంచి ప్రసాద్ హోమం జరిపారు.